నెర్రెబారిన చెరువు

నీరులేక ఎండిపోయిన కుంట్లూరు పెద్ద చెరువు

ఎండిపోయిన కుంట్లూరు పెద్ద చెరువు
ఉపాధి కోల్పోతున్న మత్స్యకారులు
వ్యవసాయ బావులు, బోర్లలో అడుగంటిన నీరు

పెద్దఅంబర్‌పేట, ఏప్రిల్ 13: చెరువుల్లో అడుగంటిన నీటితో ఉపాధి ఉసూరుమన్నది. చెరువుల్లో చేపలు పెంచుతూ ఉపాధి పొందుతున్న వంద మత్స్యకారుల కుటుంబాలకు కూలీ పనే దిక్కయింది. మున్సిపాలిటీ పరిధి కుంట్లూరులోని పెద్ద చెరువు చిన్నబోయింది. పెద్ద చెరువు దాదాపు 85 ఎకరాల్లో విస్తరించి ఉన్నది. గతంలో నగర శివారులోని వివిధ కాలనీలకు చెందిన మురుగు నీరు చెరువులోకి వచ్చి చేరేది. కానీ, స్థానిక మత్స్యకారులు పట్టుబట్టి, ప్రజాప్రతినిధుల చుట్టూ తిరిగి చెరువును బాగు చేసుకున్నారు. అందరి సహకారంతో సొసైటీని ఏర్పాటుచేసుకున్నారు. మూడేండ్లుగా దాదాపు వంద మత్స్యకారుల కుటుంబాలకు పెద్ద చెరువు ఉపాధినిస్తున్నది. అప్పటి బీఆర్ఎస్ ప్రభుత్వం ఇచ్చిన చేప పిల్లలతోపాటు సొసైటీ ఆధ్వర్యంలో అదనంగా మరిన్ని చేపలు చెరువులో వేసేవారు. వాటిని పెంచి, విక్రయిస్తూ చెరువుపైనే ఆధారపడ్డారు. పదుల ఎకరాల్లో విస్తరించిన ఈ చెరువులో నీళ్లు అడుగంటిపోతున్నాయి. ప్రస్తుతం కేవలం ఎకరన్నర విస్తీర్ణంలోపే నీళ్లు ఉన్నాయి. ఏటా జూన్, జులై నెలల్లో చేప పిల్లలు వేస్తుంటాయని సొసైటీ ప్రతినిధులు తెలిపారు. కానీ, వర్షాలు లేకపోవడంతో చేప పిల్లలు వేయలేదని, దంచికొడుతున్న ఎండలకు చెరువు నెర్రెలిచ్చిందని చెబుతున్నారు. గతంలో వేసిన చేపలు సైతం చనిపోయే పరిస్థితి వచ్చిందని ఆవేదన వ్యక్తంచేశారు. చెరువులో నీళ్లు తగ్గిపోవడంతో చేపలు నేలకు తగులుతున్నాయని, ఆక్సిజన్ అందక చనిపోతున్నాయని తెలిపారు. మత్స్య సంపదపైనే ఆధారపడ్డ వీరికి ఇతర కూలీ పనులు చేయడం ఇబ్బందిగా మారిందని, అయినప్పటికీ తప్పని పరిస్థితుల్లో కూటి కోసం కష్టాలు తప్పడంలేదని ఆవేదన వ్యక్తం చేశారు. అదే విధంగా చెరువుల్లో నీరులేక వ్యవసాయ బావులు, బోర్లలో నీరు అడుగంటుతున్నదని రైతులు పేర్కొంటున్నారు.

నేడు బీఆర్ఎస్ ముఖ్యకార్యకర్తల సమావేశం

హాజరు కానున్న బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి మన్నె శ్రీనివాస్‌రెడ్డి

కొత్తూరు, ఏప్రిల్ 13: కొత్తూరు, నందిగామ మండలాలు, కొత్తూరు మున్సిపాలిటీ బీఆర్ఎస్ ముఖ్య కార్యకర్తల సమావేశం మాజీ ఎమ్మెల్యే అంజయ్యయాదవ్ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహిస్తున్నామని బీఆర్ఎస్ మున్సిపల్ చైర్‌పర్సన్ బి.లావణ్య దేవేందర్‌యాదవ్ శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. సమావేశం ఉదయం 11 గంటలకు పాత్రస్ పోర్టులో మహబూబ్‌నగర్ ఎంపీ ఎన్నికల ప్రచార సన్నాహక సమావేశం ప్రారంభమవుతుందని వివరించారు. కార్యక్రమానికి ముఖ్య కార్యకర్తలు, ప్రజాప్రతినిధులు సకాలంలో హాజరుకావాలని వారు సూచించారు. ఎంపీ అభ్యర్థి మన్నె శ్రీనివాస్‌రెడ్డితో పాటు మాజీ ఎమ్మెల్యే అంజయ్యయాదవ్ కూడా హాజరవుతారని ఆయన వివరించారు.

నిరుద్యోగులకు ఉచిత శిక్షణ

పెద్దఅంబర్‌పేట, ఏప్రిల్ 13: సురక్ష సేవా సంఘం ఆధ్వర్యంలో నిరుద్యోగ యువతీ యువకులకు ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్టు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కే గోపీశంకర్ యాదవ్ తెలిపారు. యూనిఫాం సర్వీసుల కోసం సిద్ధమవుతున్న నిరుద్యోగ యువతకు పెద్దఅంబర్‌పేట ఔటర్‌రింగురోడ్డుకు ఆనుకుని ఉన్న ప్రాంగణంలో శారీరక సామర్థ్య పరీక్షల కోసం శిక్షణా శిబిరం ఏర్పాటుచేసినట్టు చెప్పారు. ఈ అవకాశాన్ని నిరుద్యోగులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

బాధిత కుటుంబానికి పరామర్శ

మృతదేహం వద్ద నివాళులర్పిస్తున్న రాష్ట్ర ఫుడ్ కమిషన్ చైర్మన్ గోలి శ్రీనివాస్‌రెడ్డి

కడ్తాల్, ఏప్రిల్ 13: తలకొండపల్లి మండల పరిధిలోని గట్టిఇప్పలపల్లి గ్రామానికి చెందిన వజ్రంగుప్తా మాతృమూర్తి కౌసల్య మృతిచెందింది. శనివారం రాష్ట్ర ఫుడ్ కమిషన్ చైర్మన్ గోలి శ్రీనివాస్‌రెడ్డి స్థానిక నాయకులతో కలిసి మృతదేహానికి నివాళులర్పించి బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. ఆయన వెంట నాయకులు సుభాశ్, వెంకటయ్య, జంగయ్య తదితరులు ఉన్నారు.

నేడు అంబేద్కర్ జయంత్యుత్సవాలు

యాచారం, ఏప్రిల్ 13 : మండలంలోని నందివనపర్తి గ్రామంలో జైభీమ్ ఎడ్యుకేటెడ్ యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం బీఆర్ అంబేద్కర్ ఉత్సవాలను నిర్వహించనున్నట్లు యూత్ అధ్యక్షుడు భూపతి భరత్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా వాలీబాల్ టోర్నమెంట్ నిర్వహిస్తున్నామని తెలిపారు. అంబేద్కర్ విగ్రహానికి నివాళులర్పించి విజేతలకు బహుమతులు అందజేస్తామని తెలిపారు. సాయంత్రం బహిరంగసభ నిర్వహిస్తున్నామని తెలిపారు. విద్యార్థులు, యువకులు, గ్రామస్తులు అధిక సంఖ్యలో హాజరై కార్యక్రమాలను విజయవంతం చేయాలని కోరారు.

బెల్ట్‌షాపులు నిర్వహిస్తే చర్యలు

యాచారం, ఏప్రిల్ 13 : ఫార్మాసిటీ పోలీస్‌స్టేషన్ పరిధిలో అక్రమంగా బెల్టుషాపులను నిర్వహిస్తే కఠిన చర్యలు తప్పవని హైదరాబాద్ గ్రీన్ ఫార్మాసిటీ సీఐ నరసింహారావు శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. బెల్టుషాపులపై ముమ్మరంగా దాడులు నిర్వహిస్తామన్నారు. గ్రామాల్లో ఎవరైనా బెల్టుషాపులు నిర్వహించి మద్యం, గుడుంబా విక్రయించినట్లు తెలిస్తే వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని సూచించారు. లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో ప్రతి ఒక్కరూ నిబంధనలు పాటించాలన్నారు. అక్రమంగా నగదు, బంగారం, మద్యం తరలిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు.

పట్టుబడ్డ నగదును చూపిస్తున్న పోలీసు సిబ్బంది

రూ.లక్షా50వేలు సీజ్

కొడంగల్, ఏప్రిల్ 13 : పార్లమెంటు ఎన్నికల నేపథ్యలో బార్డర్ చెక్‌పోస్టుల వద్ద ముమ్మరంగా తనిఖీలు కొనసాగుతున్నాయి. శుక్రవారం కొడంగల్ నియోకవర్గ పరిధిలోని దౌల్తాబాద్ మండలం చంద్రకల్ గ్రామ పరిసర ప్రాంతంలో తెలంగాణ-కర్ణాటక సరిహద్దులో ఏర్పాటైన బార్డర్ చెక్‌పోస్టు పోలీసు సిబ్బంది నిర్వహించిన తనిఖీల్లో రూ.లక్షా50వేలు గుర్తించి పట్టుకున్నారు. కర్ణాటక నుంచి హైదరాబాద్‌కు వెళుతున్న కారును తనిఖీ చేయగా.. కారులో నగదును గుర్తించి నగదుకు సంబంధించిన పత్రాలు అందుబాటులో లేకపోవడంతో నగదును సీజ్ చేసినట్లు పోలీసులు తెలిపారు.

నిందితుల అరెస్ట్

నిందితులను మీడియా ఎదుట ప్రవేశపెట్టి వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ బాలకృష్ణారెడ్డి

యాలాల, ఏప్రిల్ 13 : దాయాదుల చేతిలో ఎర్ర హన్మప్ప(45) ఈ నెల 8న దారుణ హత్యకు గురైన సంఘటన మండల పరిధిలోని పగిడిపల్లిలో జరిగింది. హత్య నిందితులను శనివారం డీఎస్పీ బాలకృష్ణారెడ్డి, రూరల్ సీఐ అశోక్, యాలాల ఎస్ఐ శంకర్ సమక్షంలో మీడియా ఎదుట ప్రవేశపెట్టారు. అనంతరం వారు మాట్లాడుతూ.. కొన్ని రోజులుగా ఆస్థి విషయమై అన్నదమ్ముల మధ్య తగాదాలు జరుగుతున్నాయి. ఈ నేపథ్యంలో జరిగిన హత్యకు కారణమైన ఎర్ర సమ్మప్ప, ఎర్ర రమేశ్, గోటిక రాజు, పుండికూర శేఖర్, ఎర్ర మొగులమ్మ, ఎర్ర బస్వరాజ్, మ్యాతరి రమేశ్‌లను అరెస్ట్ చేసినట్లు తెలిపారు. నిందితులను రిమాండ్ కోసం కోర్టులో ప్రవేశపెట్టనున్నట్లు డీఎస్పీ పేర్కొన్నారు.

ముదిరాజ్‌ల అభ్యున్నతికి కృషి

ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

షాద్‌నగర్‌టౌన్, ఏప్రిల్ 13: ముదిరాజ్‌ల అభివృద్ధికి ప్రభుత్వం మరింత కృషి చేస్తుందని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. పట్టణంలోని పార్టీ కార్యాలయంలో శనివారం షాద్‌నగర్ నియోజకవర్గంలోని ముదిరాజ్‌లతో సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ అసెంబ్లీ ఎన్నికల హామీలో భాగంగా ముదిరాజుల అభివృద్ధికి ప్రభుత్వం ఎంతో కృషి చేస్తుందన్నారు. ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను నెరవేర్చేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. అదే విధంగా పలువురు ముదిరాజులు పలు సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తెచ్చారు. కార్యక్రమంలో ముదిరాజ్‌లు రాములు, గోపాల్, మోహన్, మధు, శ్రీధర్‌వర్మ, నరసింహ, పెంటయ్య, అనసూయమ్మ, మహేశ్, రమేశ్, అశోక్, గిరి, సతీశ్, మల్లేశ్, యాదయ్య పాల్గొన్నారు.

చలివేంద్రం ప్రారంభం

షాద్‌నగర్‌రూరల్, ఏప్రిల్ 13 : షాద్‌నగర్ మున్సిపాలిటీలోని 27వ వార్డులో మంగ మధు ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అంబలి, చలివేంద్రం కేంద్రాన్ని శనివారం ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ ప్రారంభించారు. ఆయన వెంట నాయకులు విశ్వం, బాలరాజ్‌గౌడ్, చెన్నయ్య, బస్వం, అప్పి, అశోక్, శ్రీధర్, నరసింహ, శ్రీశైలం, వాసు, గంగాధర్, జగదీశ్, రాజు పాల్గొన్నారు.

కార్మికులకు వేతనాలు చెల్లించాలి

మంచాల, ఏప్రిల్ 13 : పంచాయతీలో పనిచేస్తున్న కార్మికులకు వెంటనే వేతనాలు చెల్లించాలని మండల కన్వీనర్ పోచమోని కృష్ణ అన్నారు. మంచాల మండలం గ్రామ పంచాయతీలో పనిచేస్తున్న కార్మికులకు వేతనాలు చెల్లించాలంటూ చేపట్టిన సమ్మె మూడవ రోజుకు చేరుకున్నది. ఈ సందర్భంగా పోచమోని కృష్ణ మాట్లాడుతూ.. పంచాయతీ సిబ్బందికి ఆరు నెలలుగా వేతనాలు చెల్లించకపోవడంతో వారి కుటుంబాలను పోషించడం కష్టతరంగా మారిందన్నారు. వెంటనే పంచాయతీ కార్మికులకు పెండింగ్ వేతనాలను చెల్లించాలని లేనియెడల కార్మికులతో కలెక్టర్ కార్యాలయాన్ని ముట్టడించనున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో పంచాయతీ కార్మికులు పాల్గొన్నారు.

కార్మికులతో మాట్లాడుతున్న పోచమోని కృష్ణ

రేపు ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభం

షాద్‌నగర్‌టౌన్, ఏప్రిల్ 13 : కేశంపేట మండల కేంద్రంలో ఐకేపీ ఆధ్వర్యంలో సోమవారం వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించనున్నట్లు ఏపీఎం భగవంత్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. వరి ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభోత్సవానికి డీఆర్డీఏ పీడీ, ఏపీడీ, ఏవో, ఎంపీడీవో, తహసీల్దార్ హాజరవుతారని తెలిపారు. రైతులు పండించిన వరి ధాన్యాన్ని ఆరబెట్టి, తేమ, తాలు లేకుండా తీసుకొచ్చి మద్దతు ధరను పొందాలన్నారు. ఏ గ్రేడ్ ధాన్యానికి రూ. 2203, సాధారణ ధాన్యానికి రూ. 2183 మద్దతు ధరను చెల్లిస్తున్నట్లు వివరించారు. ధాన్యం విక్రయించే రైతులు పాస్ బుక్ జిరాక్స్, ఆధార్‌కార్డు, బ్యాంక్ బుక్ తీసుకురావాలన్నారు. దళారులను నమ్మి మోసపోకుండా ఐకేపీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వరి కొనుగోలు కేంద్రంలో ధాన్యాన్ని విక్రయించి మద్దతు ధరను పొందాలన్నారు. ఈ అవకాశాన్ని రైతులందరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

చదువుతోనే ఉజ్వల భవిష్యత్

షాద్‌నగర్‌టౌన్, ఏప్రిల్ 13: చదువుతోనే ఉజ్వల భవిష్యత్ ఉంటుందని ఎంఈవో శంకర్‌రాథోడ్ అన్నారు. షాద్‌నగర్ పట్టణంలోని అమ్మ సోషల్ వెల్ఫేర్ అసోసియేషన్ చిల్డ్రన్ లెర్నింగ్ సెంటర్‌లో అమెజాన్ సహకారంతో ఏర్పాటు చేసిన కంప్యూటర్ ల్యాబ్‌ను శనివారం అమెజాన్ ట్రైనింగ్ స్పెషలిస్ట్ రాకేశ్‌కిరణ్, మేనేజర్ వనసరోజతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థులు చిన్నతనం నుంచి చదువుపై శ్రద్ధ పెట్టాలని, క్రమశిక్షణతో చదువుకుంటే భవిష్యత్‌లో తాము అనుకున్న లక్ష్యాన్ని సాధించవచ్చన్నారు. నేటి ఆధునిక ప్రపంచంలో కంప్యూటర్ విద్య విద్యార్థులకు అవసరమన్నారు. కార్యక్రమంలో అమెజాన్ సిబ్బంది రోషిని, ఉమా మహేశ్, అమ్మ సోషల్ వెల్ఫేర్ అసోసియేషన్ ఫౌండర్స్ శ్రీనివాస్, హరిత, నరేష్, రమ్య, కిశోర్, అశ్విని, లోకేశ్వరి, రాజేశ్వరి, వినీల, నవనీత, స్వాతి, డైరెక్టర్ శ్రీనివాసప్రసాద్‌రావు, ఆశ్వసంస్థ సభ్యులు పాల్గొన్నారు.

కంప్యూటర్ ల్యాబ్‌ను ప్రారంభిస్తున్న ఎంఈవో శంకర్ రాథోడ్, అమెజాన్ ట్రైనింగ్ స్పెషలిస్ట్ రాకేశ్‌కిరణ్

ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్‌ను గెలిపించండి

ఆమనగల్లు, ఏప్రిల్ 13 : పార్టీలకతీతంగా బీఆర్ఎస్ నాగర్‌కర్నూల్ పార్లమెంట్ అభ్యర్థి ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్‌ను భారీ మెజార్టీతో గెలిపించాలని ప్రవాస భారతీయుడు, ఆర్ఎస్‌పీ సపోర్టర్స్ వ్యవస్థాపకుడు గోవింద్ శ్రీధర్ పిలుపునిచ్చారు. ఆమనగల్లులో శనివారం ప్రవీణ్‌కుమార్‌కు మద్దతుగా ఆయనను గెలిపించాలని రిస్ట్ బ్యాండ్ ద్వారా వినూత్నంగా ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీధర్ మాట్లాడుతూ.. నాగర్‌కర్నూల్ పార్లమెంట్ నియోజకవర్గం అభివృద్ధి ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్‌తోనే సాధ్యమన్నారు. గతంలో ఆర్ఎస్‌పీ గురుకులాల కార్యదర్శిగా ఉన్న సమయంలో ఎంతో మంది విద్యార్థులను ఉన్నత విద్యావంతులుగా తీర్చిదిద్దిన ఘనత ఆయనకే దక్కిందన్నారు. కార్యక్రమంలో మాజీ వార్డు సభ్యుడు జంతుక అల్లాజీ, నాయకులు కంబాలపల్లి రమేశ్, వరుణ్, అశోక్ బద్రీ, జంతుక పర్వతాలు, స్వేరోస్ నెట్‌వర్క్ సభ్యులు రాంబాబు, ప్రవీణ్, మహేశ్ తదితరులు ఉన్నారు.

ఇనాంగూడ నూతన కమిటీ నియామకం

అబ్దుల్లాపూర్‌మెట్, ఏప్రిల్ 13 : మండలంలోని ఇనాంగూడ గ్రామపంచాయతీ పరిధి ఆర్టీసీకాలనీ హౌసింగ్, ప్లాట్ ఓనర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ నూతన కమిటీని తాజా మాజీ సర్పంచ్ అంతటి యశోదఊషయ్య గౌడ్ సహకారంతో కాలనీవాసుల సమక్షంలో శనివారం నియమించారు. నూతన అధ్యక్షుడిగా కె అశోక్‌రెడ్డి, ఉపాధ్యక్షురాలిగా వి సువర్ణ, ప్రధాన కార్యదర్శిగా కె సత్యనారాయణ, సహాయ కార్యదర్శిగా ఎన్ దవళయ్య, కోశాధికారిగా పి. శ్రీశైలంముదిరాజ్, కార్యనిర్వాహక కార్యదర్శిగా బి.శేఖర్, సలహాదారులుగా ఎ.ధన్‌రాజ్, వై.అమరేందర్ రెడ్డి, కార్యవర్గ సభ్యులుగా ఆర్.లక్ష్మణ్, ఎ.శ్రీధర్, జి.శ్రీనివాస్ నియమితులయ్యారు. నూతన కమిటీ సభ్యులు మాజీ సర్పంచ్ అంతటి యశోదఊషయ్యగౌడ్‌ను శాలువాతో సన్మానించారు. అనంతరం నియామక పత్రాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో మాజీ ఉపసర్పంచ్ అచ్చిలేశ్, నాయకులు ఆగమయ్యగౌడ్, భరత్‌గౌడ్, కాలనీవాసులు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు ఆరోగ్యంపై దృష్టి సారించాలి

గురుకుల పాఠశాలలో విద్యార్థులకు కంటిపరీక్షలు

విద్యార్థులకు ఆరోగ్యం పట్ల సూచనలు చేస్తున్న వైద్యురాలు విజయలక్ష్మి

షాద్‌నగర్‌రూరల్, ఏప్రిల్ 13 : విద్యార్థులు చదువుతో పాటు తమ ఆరోగ్యంపై దృష్టి సారించాలని డిప్యూటీ డీఎంహెచ్‌వో విజయలక్ష్మి అన్నారు. ఫరూఖ్‌నగర్ మండలంలోని కమ్మదనం గ్రామశివారులోని తెలంగాణ సాంఘిక సంక్షేమ బాలికల గురుకుల పాఠశాలలో బూర్గుల ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో శనివారం విద్యార్థులకు నిర్వహించిన కంటి వైద్యశిబిరంలో ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. విద్యార్థులు వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. కంటి సమస్య రాకుండా ఉండేందుకు విటమిన్ ఏ ఆహార పదార్థాలను తీసుకోవాలన్నారు. అనంతరం అప్తాల్మిక్ అధికారి శ్రీహరి 253 మంది విద్యార్థులకు కంటి పరీక్షలు నిర్వహించారు. వీరిలో 17 మంది విద్యార్థులకు కంటి అద్దాలు అవసరమని గుర్తించి షాద్‌నగర్ ప్రభుత్వ దవాఖానకు రిఫర్ చేశారు. కార్యక్రమంలో హెల్త్ ఎడ్యుకేటర్ శ్రీనివాసులు, ఫార్మాసిస్టు అన్నపూర్ణ, ఏఎన్ఎం సునీత, పాఠశాల ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ హేమలత, రెసిడెన్సియల్ స్కూల్ స్టాఫ్ నర్స్ స్రవంతి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మానసిక వేదనతో వ్యక్తి ఆత్మహత్య

యాలాల, ఏప్రిల్ 13: తాండూరు పట్టణంలోని అవేకా లాడ్జిలో వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న సంఘటన శనివారం చోటుచేసుకుంది. పోలీసులు, కుటుంబ సభ్యులు తెలిపిన వవరాల ప్రకారం... మృతుడు కొడంగల్ మండలం టేకులకోడ్ గ్రామానికి చెందిన డంకూర్ చిన్న శ్యామప్ప(63) తాండూరు పట్టణంలోని అవేకా లాడ్జిలోని బాత్‌రూంలోని ఎగ్జిస్టింగ్ ఫ్యానుకు ఉరి వేసుకొని మరణించాడు. అనారోగ్య కారణాలతో పాటు, మృతుడి కుమారుడు సంవత్సరం క్రితం ప్రమాదవశాత్తు మరణించడం, చిన్న కుమార్తె ప్రేమ వివాహం చేసుకోవడంతో మానసిక వేదనతో ఆత్మహత్యకు పాల్పడి ఉండవచ్చని ప్రాథమికంగా అనుమానిస్తున్నారు. మృతుడి భార్య డంకూర్ ఆశమ్మ పిర్యాధు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

నినాదాలు చేస్తున్న బడంగ్‌పేట మున్సిపల్ కార్పొరేషన్ బీఆర్ఎస్ నేతలు

మీర్‌పేట నుంచి చేవెళ్ల సభకు బయలుదేరుతున్న బీఆర్ఎస్ నేతలు

గులాబీ జెండా ఎగరేస్తాం

చేవెళ్ల ప్రజా ఆశీర్వాద సభకు భారీగా తరలివెళ్లిన గులాబీ శ్రేణులు

బడంగ్‌పేట, ఏప్రిల్ 13: చేవెళ్ల పార్లమెంట్ ఎంపీ అభ్యర్థి కాసాని జ్ఞానేశ్వర్ గెలుపునకు మద్దతుగా నిర్వహించిన ప్రజా ఆశీర్వాద సభకు మహేశ్వరం నియోజకవర్గం ఎమ్మెల్యే పి.సబితా ఇంద్రారెడ్డి ఆధ్వర్యంలో భారీగా తరలివెళ్లారు. బీఆర్ఎస్ పార్టీ నాయకులు, అనుబంధ సంఘాల నాయకులు, రైతులు, బీఆర్ఎస్ అభిమానులు, మహిళలు భారీగా సభకు తరలివెళ్లారు. బడంగ్‌పేట మున్సిపల్ కార్పొరేషన్ నుంచి 40 బస్సులు, 25 కార్లు, తుక్కుగూడ నుంచి 10 బస్సులు, 10 కార్లు, మీర్‌పేట మున్సిపల్ కార్పొరేషన్ నుంచి 30 బస్సులు, 20 కార్లు, కందుకూరు మండలంలోని వివిధ గ్రామాల నుంచి 35 బస్సులు, మహేశ్వరం మండలంలోని వివిధ గ్రామాల నుంచి 30 బస్సులు, 15 కార్లు, జల్‌పల్లి మున్సిపాలిటీ నుంచి 10 బస్సులు, 10 కార్లలో బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో తరలివెళ్లారు. సభా ప్రాంగణానికి చేరుకున్న తర్వాత గులాబీ జెండాలతో జై తెలంగాణ నినాదాలు చేశారు. బీఆర్ఎస్ పార్టీ ద్వారానే అభివృద్ధి సాధ్యం అవుతుందని నినాదాలు చేశారు. కేసీఆర్ ద్వారానే రైతులకు మేలు జరుగుతుందని, కేసీఆర్ నాయకత్వాన్ని ప్రజలు బలంగా నమ్ముతున్నారని బీఆర్ఎస్ నాయకులు పేర్కొంటున్నారు. చేవెళ్ల పార్లమెంట్ నుంచి బీఆర్ఎస్ ఎంపీగా ముచ్చటగా మూడోసారి గెలిపించుకుంటామని నేతలు శపథం చేశారు. బీఆర్ఎస్ పార్టీకి ద్రోహం చేసిన నేతలకు చేవెళ్ల పార్లమెంట్ ఎన్నికల్లో గుణపాఠం చెబుతామని నేతలు శపథం చేశారు. నమ్మక ద్రోహులకు రాజకీయ సమాధి తప్పదని నేతలు జోస్యం చెప్పారు. తరలివెళ్లిన వారిలో మీర్‌పేట మేయర్ దుర్గా దీప్‌లాల్ చౌహాన్, డిప్యూటీ మేయర్ తీగల విక్రంరెడ్డి, బడంగ్‌పేట బీఆర్ఎస్ అధ్యక్షుడు రాంరెడ్డి, మీర్‌పేట అధ్యక్షుడు కామేశ్ రెడ్డి, తుక్కుగూడ అధ్యక్షుడు లక్ష్మయ్య, మహేశ్వరం అధ్యక్షుడు రాజూనాయక్, కార్పొరేటర్లు, జిల్లా నాయకులు, మండలాల నాయకులు, మాజీ ఎంపీటీసీలు, మాజీ సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, కౌన్సిలర్లు తదితరులు ఉన్నారు.

జల్‌పల్లి నుంచి వెళ్తున్న బీఆర్ఎస్ నేతలు

కందుకూరు నుంచి వెళ్తున్న బీఆర్ఎస్ నేతలు

బీఆర్ఎస్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్‌ను కలిసిన మాజీ ఏఎంసీ డైరెక్టర్

ఆమనగల్లు, ఏప్రిల్ 13: బీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రివర్యులు కల్వకుంట్ల తారక రామారావును శనివారం హైదరాబాద్‌లో ఆమనగల్లు ఏఎంసీ మాజీ డైరెక్టర్ సురమల్ల సుభాష్ మర్యాదపూర్వకంగా కలిశారు.

ఓఆర్ఆర్‌పై రోడ్డు ప్రమాదం

ఒకరి మృతి, ఇరువురికి గాయాలు

ఆదిబట్ల, ఏప్రిల్13: రోడ్డు ప్రమాదంలో ఓ బాలుడు మృతి చెందగా, డ్రైవర్‌తో పాటు మరో వ్యక్తికి తీవ్రగాయాలైన ఘటన శనివారం జరిగింది. ఆదిబట్ల సీఐ రాఘవేందర్ రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. కర్నాటక రాష్ట్రం రాయచూర్ నుంచి ఉల్లిగడ్డ లోడుతో హైదరాబాద్ వస్తున్న బొలెరో వాహనంలో అంబాజీ అతడి కుమారుడు సామ్రాట్ పెద్ద అంబర్‌పేట వద్ద లోడును ఖాళీ చేయడానికి వెళ్తున్నారు. ఓఆర్ఆర్ రావిరాల వద్దకు రాగానే వారు ప్రయాణిస్తున్న వాహనం అదుపు తప్పి పల్టీ కొట్టింది. వాహనం నడుపుతున్న విఠల్ మరో వ్యక్తి అంబాజీకి తీవ్ర గాయాలయ్యాయి. అంబాజీ కొడుకు సామ్రాట్ (13) అక్కడికక్కడే మృతి చెందాడు. క్షతగాత్రులను చికిత్స నిమిత్తం హైదరాబాద్‌కు తరలించారు. ఈ మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

నేటి నుంచి కల్యాణ మహోత్సవాలు

ఇబ్రహీంపట్నం, ఏప్రిల్ 13 : మంచాల మండలంలోని నోముల గ్రామంలో కొలువుదీరిన శ్రీ సీతారామచంద్రస్వామి కల్యాణ మహోత్సవాలు ఆదివారం నుంచి ఈ నెల 18వరకు జరుగనున్నాయి. ఆలయధర్మకర్త ముత్యాల హరికిషన్ ఆధ్వర్యంలో ఏర్పాట్లు పూర్తయ్యాయి. ఉత్సవాల్లో భాగంగా ఈ నెల 17న సీతారామచంద్రస్వామి కల్యాణ మహోత్సవం జరుగనున్నది. వారంరోజుల పాటు ప్రతి రోజూ ఉదయం, సాయంత్రం పూజా కార్యక్రమాలు నిర్వహించనున్నారు. కల్యాణ మహోత్సవాలకు ఏర్పాట్లు పూర్తిచేసినట్లు ఆలయ ధర్మకర్త ముత్యాల హరికిషన్ తెలిపారు.